క్లుప్తంగా

31న అధికారులకు ఎన్నికలపై శిక్షణ



ఎర్రవల్లిచౌరస్తా: ఈనెల 31న ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు గద్వాల ఆర్డీఓ చంద్రకళ శనివారం తెలిపారు. ఎర్రవల్లి మండల కేంద్రంలోని ఏకశిల పాఠశాలను ఆమె సందర్శించారు. ఎన్నికల్లో విధుల నిర్వహించే పీఓ, ఏపీఓలకు ఎన్నికలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు పాఠశాలలో అవసరమైన తరగతి గదులను, వసతులను ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. శిక్షణకు అవసరమైన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక అధికారులకు ఆదేశించారు. ఆర్డీఓ వెంట స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్రమణ్యం, తహసీల్దార్లు మంజుల, నందిని, సిబ్బంది ఉన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపిక

ధరూరు: రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు మండల కేంద్రం నుంచి విద్యార్థులు ఎంపికైనట్లు జీహెచ్ఎం ప్రతాప్‌రెడ్డి తెలిపారు. 27వ తేదీ శనివారం మహబూబ్‌నగర్‌లో జరిగిన 67వ ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో ధరూరు ఉన్నత పాఠశాలకు చెందిన వెంకటేష్, నవీన్, మల్లికార్జున్‌లు అండర్–17 విభాగంలో ఎంపికయ్యారు. అండర్–14 విభాగంలో చిన్న ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికై న విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

గల్లంతైన యువతి మృతదేహం లభ్యం

ధరూరు: నెట్టెంపాడు కాల్వలో దూకి యువతి శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది. ఆ యువతి మృతదేహం శనివారం లభ్యమైనట్లు ధరూరు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని దోర్నాలకి చెందిన నారాయణ కుమార్తె అరుణ(18)ను అదే గ్రామానికి చెందిన రాజు అనే యువకుడు కొంతకాలంగా లైంగికంగా వేధిస్తున్నాడు. అందుకు గ్రామానికి చెందిన ఆంజనేయులు, తాయన్న సహకరించారని, లైంగిక వేధింపుల కారణంగానే తమ చెల్లి ఆత్మహత్యకు పాల్పడిందని ఆమె అన్న ఆంజనేయులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తమకు న్యాయం చేయాలంటూ దోర్నాల రోడ్డులో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివానందం గౌడ్ వివరించారు.

ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి

అలంపూర్ రూరల్: ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐ రాజు, ఎస్ఐ మడుగు రమేష్‌లు అన్నారు. మండలంలోని లింగన్‌వాయి, క్యాతూర్ గ్రామాల్లో సీఐ రాజు ఆధ్వర్యంలో ఐటీబీటీ (ఇండో టిబెటిన్ సరిహద్దు దళం)సెంట్రల్ ఫోర్స్, స్థానిక పోలీస్ బలగాలతో కవాత్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ధైర్యంగా ఓటును వినియోగించుకోవాలని, ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


గొర్రెలకు రోగ నిరోధక టీకాలు

అయిజ: గొర్రెలకు, మేకలకు పారుడు రోగం రాకుండా నిరోధించేందుకు ఈనెల 30వ తేదీ నుంచి టీకాలు వేస్తున్నట్లు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూప రాణి తెలిపారు. నవంబర్ 20వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకారం గ్రామాల వారీగా పశువులకు టీకాలు వేస్తున్నట్లు శనివా రం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కనుల పండువగా కల్యాణోత్సవం

మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలోని స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం శనివారం కనుల పండువగా నిర్వహించారు. మహాహోమం నిర్వహించి స్వామి వారి ఉత్సవమూర్తులకు కల్యాణం జరిపించారు. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అనంతరం పల్లకీ సేవ, రథోత్సవం నిర్వహించారు.కార్యక్రమంలో ఆలయ ఈఓ సత్యశ్చంద్రారెడ్డి, అరవిందరావు, మధుసూదన్‌రెడ్డి, బాబురావు చంద్రశేఖర్‌రావు, ధీరేంద్రదాసు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చర్లలో మద్యం పట్టివేత



రాజోళి: ఎన్నికల వేళ పోలీసులు దాడులు ముమ్మరం చేశారు. మండలంలో అనుమానమొచ్చిన ప్రతి గ్రామంలో దాడులు నిర్వహించి అక్రమంగా మద్యం అమ్మె వారిని గుర్తించి, మద్యాన్ని పట్టుకుంటున్నారు. ఈ క్రమంలో పచ్చర్లలోని మాబు ఇంటిపై పోలీసులు దా డులు చేసి 19.89 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మద్యం విలువ రూ.13,330 ఉంటుందని పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఖాదర్ బాషా తెలిపారు.

నీరులేక ఎండుతున్న పంటలు

- చేతికొచ్చాక నష్టపోతున్న వైనం
- అయోమయంలో రైతులు



ఉండవెల్లిలో ఎండిన మొక్కజొన్న పంట

ఉండవెల్లి: పంటలు వేశాక సరైన సమయంలో నీళ్లు రావడం లేదు. కురిసిన వర్షాలు ఒక్కోచోట కురిస్తే మరోచోట పడలేదు. ఊరిలో కురుస్తే పొలంలో చినుకులేని పరిస్థితి. వర్షాలు వస్తాయని ఆశతో కలుపులు, నారు, మందులు ఇలా రైతులు ఖర్చు చేస్తున్నారు. యాసంగి మొదలవడంతో దసరా పండుగ అయిపోయినా చినుకు లేని పరిస్థితి. అలంపూర్ నియోజకవర్గంలో అధిక శాతం వర్షాధార పంటలే అధికంగా ఉన్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా పప్పు శనగ, మినుములు, మొక్కజొన్న వేసేవారు. ఇప్పుడు చినుకు రాలనిదే పంట వెయలేని పరిస్థితి ఏర్పడింది. నీటి కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రయత్నిస్తున్న ఆర్డీఎస్‌కు ఎలాంటి నీరు అందక ఉన్న పంటలు ఎండుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. బోర్లలో నీరు లేక రైతులు పంటలకు నీరందక ఆర్డీఎస్‌కు 2100 క్యూసెక్కుల నీరు అందాల్సిన క్రమంలో నీరు లేని పరిస్థితి ఉంది. నదుల్లో నీళ్లు లేవు, డ్యాంలో నీరు నిల్వ లేవని అధికారులు తేల్చి చెప్పడంతో రైతులు ఆశలు ఆవిరవుతున్నాయి.

అలంపూర్ డివిజన్‌లో గతేడాది లక్ష 14 వేల ఎకరాల్లో పత్తి సాగు చేయడంతో ఈ ఏడాది లక్ష లోపే పత్తి పంట సాగు చేశారు. అలంపూర్ నియోజకవర్గంలో కంది, మిరప, పత్తి, మొక్కజొన్న పంటలే అధికంగా పండుతున్నాయి. ప్రస్తుతం కంది, మొక్కజొన్న, మిరప పంటలను అధికంగా సాగు చేశారు. పత్తి తగ్గి కంది వైపు మొగ్గు చూపినా వర్షం లేక ఎండుతోంది. ఏ పంటలకై నా వర్షమే ఆధారమని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎండల తీవ్రత పెరుగుతుండడంతో భూమిలో తేమ శాతం తగ్గిపోయింది.



ఎండుమొకం పడుతున్న కంది పంట

రెండు ఎకరాల్లో నష్టం..



మేము రెండు ఎకరాల్లో మొక్కజొన్న, కంది సాగు చేశాం. ప్రతి ఏడాది వర్షం పడుతుందని ఆశతో మిరప సాగు చేసేవాడిని. ఈ సారి పంట మార్పు చేయాలని మొక్కజొన్న వేస్తే ఆర్డీఎస్ నీరు అందక, సమయానికి వర్షం రాకా పంట మొత్తం ఎండుముఖం పట్టింది. నీరు లేక, వర్షం లేక ఇబ్బందులకు గురవుతున్నాం. ఒక్కసారికై నా ఆర్డీఎస్ నీరు అందిస్తే పెట్టుబడి అయినా వస్తుందని ఆశపడుతున్నాం.

– శేఖర్‌రెడ్డి, రైతు, ఉండవెల్లి

కేంద్ర బలగాలతో కవాతు



ఉండవెల్లిలో కేంద్ర బలగాల కవాతు

ఉండవెల్లి: రానున్న ఎన్నికల్లో ప్రజలు భయపడకుండా ఇష్టం వచ్చిన వారికి ఓటు వేసుకోవాలని ఐటీబీపీ(ఇండో టిబెన్ బార్డర్ పోలీస్)జవాన్లు, కవాతు నిర్వహించి గ్రామస్తులకు సూచించారు. మండలంలోని పుల్లూరు, ఇటిక్యాలపాడు, మండల కేంద్రం, కంచుపాడు, తక్కశిల గ్రామాల్లో ఐటీబీపీ జవాన్లు కవాతు నిర్వహించారు. ప్రధాన వీధుల్లో తిరుగుతూ ఓటర్లకు అవగాహన కల్పించారు. ఎవరైనా అభ్యర్థులు, పార్టీలకు చెందిన నాయకులు దౌర్జన్యం చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపారు. మొత్తం సిబ్బంది 60 మంది కవాతులో నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రాజశేఖర్, రవి కుమార్, మద్దిలేటి పాల్గొన్నారు.

మూఢనమ్మకాలకు దూరంగా ఉండండి



ప్రజలను చైతన్యం చేస్తున్న కళా బృందం

అయిజ: సాంకేతిక పరిజ్ఞానంతో దూసుకపోతున్న ఈ రోజుల్లో ఇంకా కొంతమంది మూఢనమ్మకాలపై విశ్వాసం చూపుతున్నారని, ప్రజలు వాటికి దూరంగా ఉండాలని కళాకారుల బృందం కోరారు. ఎస్ఐ నరేష్ కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో శనివారం రాత్రి పోలీసులు, కళాకారుల బృందం సభ్యులు మూఢనమ్మకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాకారుల బృందం పాటలు పాడుతూ ప్రజలను చైతన్యం చేశారు. మహిళలకు షీ టీం అండగా ఉంటుందని, మహిళలపై జరుగుతున్న భౌతిక దాడులు, వేధింపులపై బాధితులు, షీ టీంకు, పోలీస్‌లకు తెలుపాలని కోరారు. ఎన్నికల కోడ్ ఉండడంతో సామాజిక మాధ్యమాల్లో ప్రజలను రెచ్చగొట్టే మెసేజ్‌లు పెట్టరాదని సూచించారు. కార్యక్రమంలో రంజిత్ కుమార్, రామన్న, హర్షవర్ధన్, కళాబృందం సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన అధికారులు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఎంపీఓ

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో పోలింగ్ స్టేషన్లను ఎంపీడీఓ రవీంద్ర, ఎంపీఓ తిరుపతన్నలు శనివారం పరిశీలించారు. మండలంలోని రామాపురం, జిల్లెడుదిన్నె, జూలెకల్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను అధికారులు తనిఖీ చేశారు. ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలు, గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేస్తున్న పోలింగ్ స్టేషన్లలో ఓటర్లకు కావాల్సిన సౌకర్యాలను పరిశీలించారు. కరెంట్, ఫర్నీచర్, తాగునీరు, మరుగుదొడ్లకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులకు సౌకర్యాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎంపీడీఓ వెంట పంచాయతీ కార్యదర్శులు, ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

అయిజ: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రూట్ నెం6 పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ సాయిప్రకాష్ పరిశీలించారు. మండలంలోని కిసాన్ నగర్, పులికల్, రాజాపురం, బైనిపల్లి, కొత్తపల్లి పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ సందర్శించి వాటిలో ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఓట్ల కోసమే నీళ్ల డ్రామాలు



మాట్లాడుతున్న కేశవరావు

అలంపూర్: అధికార పార్టీ నాయకులు ఓట్ల కోసమే నీళ్ల డ్రామాల ఆడుతున్నారని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని బీఎస్పీ కార్యాలయం వద్ద శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఓట్ల కోసమే అధికార పార్టీ నాయకులు ఆర్డీఎస్ డ్రామాలు చేస్తున్నారన్నారు. ఏ నాడు రైతుల కోసం కొట్లాడని ఎమ్మెల్సీ చల్లా ఇప్పుడు రైతులపై కపట ప్రేమ చూపుతున్నారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు, రైతులకు సహాయం చేసింది లేదన్నారు. ప్రజలు అవగాహనతో ఉన్నారన్నారు. ప్రజలు ఓటు ఎవరికి వేయాలో నిర్ణయం తీసుకున్నారన్నారు. రాష్ట్రంలో బీఎస్పీ అధికారంలోకి వస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, మధుగౌడ్, రాంప్రసాద్ రెడ్డి, తిరుపాల్, సుంకన్న, కనకం బాబు, రవి చందర్, నాగేశ్వర్ రెడ్డి, ప్రభుదాసు ఉన్నారు.

ఉత్సాహంగా సందెపురాళ్ల పోటీలు



గట్టులో నిర్వహించిన సందేరాళ్ల పోటీలు

గట్టు: వాల్మీకి జయంతి సందర్భంగా శనివారం గట్టులో సందెపురాళ్ల పోటీలను నిర్వహించారు. సర్పంచు ధనలక్ష్మి, పంచాయతీ కో ఆప్షన్ సభ్యుడు సత్యనారాయణ సందెపురాళ్ల పోటీలను ప్రారంభించారు. సందేరాళ్ల పోటీల్లో గట్టుకు చెందిన గువ్వల పరుశరాముడు 86 కేజీల రాయిని ఎత్తి మొదటి బహుమతి రూ.2016లను దక్కించుకున్నారు. ద్వితీయ బహుమతిని లింగయ్యల కృష్ణ 80 కేజీల చేతి రాయిని ఎత్తి ద్వితీయ బహుమతి రూ.1016లను దక్కించుకున్నారు. తృతీయ బహుమతిని తాటాకుల రాజు, తెలుగు నల్లారెడ్డిలు 75 కేజీల చేతి రాయిని ఎత్తి తృతీయ బహుమతి రూ.516లను దక్కించుకున్నారు. విజేతలకు సర్పంచు ధనలక్ష్మి, పంచాయతీ కోఆప్షన్ సభ్యుడు సత్యనారాయణ, శ్రీనాథ్‌లు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు రాము బోయదేవన్న, గోపాల్, పిల్లి నర్సింహులు, గోవిందు, గువ్వల నర్సింహులు, బల్గెర బజారి, బాపురం వెంకటేష్, తంగెలగడ్డ శ్రీనివాసులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఫిరోజ్



నియామకపత్రాన్ని అందుకుంటున్న ఫిరోజ్

శాంతినగర్: తెలంగాణ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఐజ మున్సిపాలిటీకి చెందిన ఫిరోజ్‌ను నియమిస్తూ యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి సురభి దివేది, తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనరెడ్డిలు శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జోగులాంబ గద్వాల జిల్లా కార్యదర్శిగా ఉన్న ఫిరోజ్ చేస్తున్న కార్యక్రమాలను గుర్తించి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు ఆపార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ తనను నమ్మి రాష్ట్ర పదవిని కట్టబెట్టినందుకు కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడానికి శక్తి వంచన లేకుండా కృషిచేస్తానన్నారు. పదవి రావడానికి కృషిచేసిన ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపుతు శాంతినగర్ క్యాంపు కార్యాలయంలో నియామకపత్రం అందుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి శేక్షావలి ఆచారి, అయిజ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జయన్న, జిల్లా ఉపాధ్యక్షుడు గిత్తల దేవరాజు, జిల్లా కార్యదర్శి రాజు, టౌన్ మహిళ అధ్యక్షురాలు సులోచన, బీసీ టౌన్ ప్రసిడెంట్ బసవరాజు, అయిజ మండల నాయకులు పాండురంగ, మహేష్, దేవేందర్, మల్లికార్జున్, కార్యకర్తలు పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం

ధరూరు: క్రీడలు ఏవైనా గెలుపు ఓటములు సహజమని, ఓటమి గెలుపుకు పునాది లాంటిదని మండల వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ర్యాలంపాడులో వాల్మీకి జయంతిని పురస్కరించుకుని వాల్మీకి విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. అనంతరం సందరాళ్ల పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచు కర్రెమ్మ, ఉప సర్పంచు చిట్టెం వెంకట్రామిరెడ్డి, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, దౌలన్న, అంపన్న, రంగారెడ్డి, రంగన్న గౌడ్, కురుమన్న, సాయన్న, బతుకన్న, పెద్ద నర్సింహులు పాల్గొన్నారు.

రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

రాజోళి: శనివారం పౌర్ణమిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరశైవ సమాజం సభ్యులు, పుట్టిలో నది మధ్యలో ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లి స్వామి వారికి అభిషేకం, అర్చనలు సాంప్రదాయబద్దంగా నిర్వహించారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పశువులకు టీకాలు

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని జూలెకల్ లో పశువులకు సోకే లంపిస్కిన్ (ముద్ద చర్మవ్యాధి) వ్యాధి నివారణ కోసం శాంతినగర్ పశువైద్యశాల సిబ్బంది ముందస్తు టీకాలు వేశారు. ఈ సందర్భంగా 22 మంది రైతులకు చెందిన 126 ఆవులు, ఎద్దులకు టీకాలు వేసినట్లు ఓఎస్ పాలాగు తెలిపారు. ముందస్తు టీకాలు వేయిస్తే పశువులు లంపిస్కిన్ వ్యాధి బారిన పడవని, రైతులు తప్పకుండా టీకాలు వేయించాలని పశువైద్యులు సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

శాంతినగర్: వడ్డేపల్లి మండల యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణకాంత్ కుటుంబాన్ని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ శనివారం పరామర్శించారు. కృష్ణకాంత్ తల్లి జయమ్మ ఇటీవల మరణించింది. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను కలిసి సానుభూతి తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఎమ్మెల్యే వాహనాన్ని తనిఖీ చేసిన పోలీసులు

శాంతినగర్: ఎన్నికల కోడ్‌లో భాగంగా నిర్వహిస్తున్న తనిఖీల్లో ఎమ్మెల్యే వాహనాన్ని పోలీసులు తనిఖీచేశారు. వడ్డేపల్లి మండలంలోని జూలెకల్ ఆర్డీఎస్ కెనాల్ సమీపంలో శనివారం శాంతినగర్ పోలీసులు తనిఖీ నిర్వహించారు. ఎమ్మెల్యే అబ్రహం అయిజ మండలానికి వివిధ కార్యక్రమాల నిమిత్తం వెళ్లి వస్తున్న క్రమంలో ఎన్నికల నిబంధనల ప్రకారం ఎమ్మెల్యే వాహనాన్ని తనిఖీ చేసి పంపించారు.

పరిసరాల పరిశుభ్రతను పాటించాలి

కేటీదొడ్డి: విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్ కో–ఆర్డినేటర్ మురళీధర్ అన్నారు. శనివారం మండలంలోని నందిన్నెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పద్మశ్రీ దామోదర ఫౌండర్ గ్రామాలయ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ ఏళ్లన్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆధునిక మూత్రశాలలు నిర్మించారు. ఈ సందర్భంగా వారు హాజరై వాటిని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రణేశ్వర్‌రెడ్డి, హెచ్ఎం రెడ్యానాయక్, బాలు, ఎస్ఎంసీ చైర్మన్ వీరన్న, ఉపాధ్యాయులు నర్సింహులు, కృష్ణయ్య, వీరేష్, జయరాజ్, పాల్గొన్నారు.

పాలస్తీనాపై దాడులు ఆపాలి



అలంపూర్‌లో మాట్లాడుతున్న నర్సింహ

గద్వాల అర్బన్: పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధ దమనకాండను ఆపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, కార్యదర్శి వీవీ నర్సింహ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పాతబస్టాండులో సీఐటీయూ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 20రోజులుగా పాలస్తీనా గాజా ప్రాంతంపై ఇజ్రాయెల్ వైమానిక దాడులతో సుమారు 6వేల మంది మరణించారని, వేలాది మంది క్షతగాత్రులుగా మిగిలారని తెలిపారు. కార్యక్రమంలో నర్సింహులు, రఘు, రామకృష్ణ, పరుశరాముడు, బాలరాజు, వీరేష్ ఉన్నారు.

అలంపూర్: ఇజ్రాయిల్ పాలస్తీన మధ్య ఐక్యరాజ్య సమితి శాంతి చర్చలు నిర్వహించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నరసింహ అన్నారు. అలంపూర్ పట్టణంలోని గాంధీ చౌక్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో సంఘీభావం సభ నిర్వహించారు.

మానవపాడు: ఇజ్రాయెల్, పాలస్తీన మధ్య శాంతి చర్చలు జరపాలని అందుకు ఐక్యరాజ్యసమితి చొరువ చూపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి తెలిపారు. మండల కేంద్రంలోని పాలస్తీనకు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాలిక్‌బాషా, మద్దిలేటి పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఆదర్శవంతమైన పాలన



ప్రచారంలో మాట్లాడుతున్న బండ్ల జ్యోతి

కేటీదొడ్డి: గద్వాల నియోజకవర్గంలో మరోసారి కారు జోరు కొనసాగించేలా చూడాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి పేర్కొన్నారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని మల్లాపురం, సిద్దన్‌పల్లి, ఇర్కిచేడు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమైక్య పాలనలో అభివృద్ధికి ఆమడదూరంలో ఉండేదని, పక్కనే కృష్ణ, తుంగభద్ర నదులున్న ఇప్పుడు రాష్ట్రంలో ఆదర్శవంతంమైన పాలన అందిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల మన్ననలను పొందుతుందని తెలిపారు. సిద్దన్‌పల్లితండాలో ఏకగ్రీవంగా బీఆర్ఎస్ పార్టీకి వేస్తామని వారు తీర్మానం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, జెడ్పీటీసీలు పద్మమ్మ, రాజశేఖర్, వైస్ఎంపీపీ రామకృష్ణనాయుడు, మండల అధ్యక్షుడు ఉరుకుందు, హనుమంతు, నాయకులు చక్రధర్, గోవిందు, నసీర్, గోపి, యుగంధర్, వెంకటేష్ నాయుడు, నీవన్‌కుమార్, నర్సింహులు శెట్టి పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి



మాట్లాడుతున్న ముసాహీదాబేగం

మానవపాడు: అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముఖ్యకార్యనిర్వాహక అధికారి ముసాహీదాబేగం అన్నారు. శనివారం మండలంలోని బోరవెల్లిలో అంగన్‌వాడీ సెంటర్లను ఆమె తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనంపై పరిశీలించి, మెనూ ప్రకారం అందించాలని ఆదేశించారు. నర్సరీలు పరిశీలించి మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని అందించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మౌనిక, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

భావితరాలకు ఆదర్శం వాల్మీకి మహర్షి



ధరూరులో నివాళులర్పిస్తున్న సరిత



అయిజలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

ధరూరు: వాల్మీకి మహర్షి జయంతి వేడుకల్లో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సరిత, మాజీ మార్కెట్ యార్డు చైర్ పర్సన్ బండ్ల లక్ష్మీదేవిలు పాల్గొన్నారు. మండల కేంద్రంలో వాల్మీకి భవన నిర్మాణ ప్రాంతంలో వాల్మీకులు ఏర్పాటు చేసిన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు.

మల్దకల్: మండలంలో బిజ్వారం, మల్దకల్, పెద్దపల్లి, అమరవాయి, ఉలిగేపల్లి, ఎల్కూరు, విఠలాపురం, నాగర్‌దొడ్డి, తాటికుంట, అడవిరావులచెర్వు, నేతువానిపల్లిలో వాల్మీకి విగ్రహాలు, వాల్మీకి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్మీకి చిత్రపటంతో ఆయా గ్రామాల్లో ఊరేగించారు.

కేటీదొడ్డి: వాల్మీకి మహర్షి భావితరాలకు ఆదర్శనీయమని వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడు టీచర్ గోవిందు అన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా శనివారం మండలంలోని నందిన్నె, కేటీదొడ్డి, చింతలకుంట, ఇర్కిచేడు, కొండాపురం, కుచినెర్ల తదితర గ్రామాల్లో వాల్మీకి సంఘం నాయకుల ఆధ్వర్యంలోని నిర్వహించిన జయంతికి ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి హాజరై వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

శాంతినగర్: రామాయణ కావ్య సృష్టికర్త మహర్షి వాల్మీకి జయంతిని వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలోని ఆయా గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. షైపాడు, రామాపురం, కోయిల్‌దిన్నె గ్రామాల్లో ప్రతిష్ఠించిన వాల్మీకి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో వాల్మీకి మహర్షి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో వాల్మీకి మహర్షి జయంతిని వాల్మీకి నాయకులు ఘనంగా నిర్వహించారు.

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరులో వాల్మీకి జయంతి సందర్భంగా వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొంకూరులో సర్పంచు శ్రీలత ఆధ్వర్యంలో వాల్మీకి విగ్రహానికి బోయలు ప్రత్యేక పూజలు చేశారు.

అయిజ: పట్టణంలోని పాతబస్టాండ్‌లో వాల్మీకి మహర్షి విగ్రహానికి అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని తిమ్మాపురంలో మాజీ ఎంపీటీసీ నారాయణ నాయుడు స్థానిక నాయకులతో కలిసి వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొండేరు, కోదండాపురం గ్రామాల్లో వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. కార్యక్రమానికి ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ హాజరై ఆయా గ్రామాల నాయకులతో కలిసి వాల్మీకి మహర్షి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గట్టు: మండలం కేంద్రంలో, మాచర్ల, బల్గెర, రాయాపురం, చాగదోన, తుమ్మలపల్లి, ఇందువాసి చమన్‌ఖాన్‌దొడ్డి గ్రామాల్లో వాల్మీకి జయంతి వేడుకల్లో జెడ్పీటీసీ బాసు శ్యామల, సర్పంచుల సంఘం అధ్యక్షుడు హనుమంతునాయుడులు పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే కంచు కోటగా మార్చుతాం

రాజోళి: ఎమ్మెల్యే టిక్కెట్ తమకు కేటాయిస్తే అలంపూర్‌లో బీఆర్ఎస్ పార్టీకి కంచుకోటగా మార్చుతామని ప్రేమలత పల్లయ్య అన్నారు. మండలంలోని చిన్న దన్వాడలో కుర్వ సామాజిక వర్గం నాయకులతో కలిసి శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తూ నిత్యం ప్రజల్లో ఉంటున్నామన్నారు. కార్యక్రమంలో కురువ నాయకులు పాల్గొన్నారు.